క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.వీర ప్రభాకర్ తెలిపారు. ఈనెల 19లోపు దోస్త్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీఎస్సీ ఎంపీసీఎస్, ఎంపీసీ, ఎంఎస్‌టీసీఎస్, బీజెడ్‌సీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. సరైన ధ్రువపత్రాలుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 81063 85402 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



సిరిసిల్ల డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కోనరావుపేట: మండలంలోని కొండాపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామస్తులు సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం నుంచి కోనరావుపేటలోని మోడల్ స్కూలు, కళాశాలకు రోజూ విద్యార్థులు వెళ్తున్నారని, ఉదయం సాయంత్రం వేళల్లో బస్సును నడిపితే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీంతో గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడ యశోద వేణు, లింగారెడ్డి, తాళ్లపల్లి శంకర్, గడ్డం రెడ్డి, బెదిరె, దేవయ్య తదితరులున్నారు.

ఎల్లమ్మ సిద్దోగం వేడుకలు



ఇల్లంతకుంట: మండలంలోని ముస్కానిపేటలో గౌడ కులస్తులు ఎల్లమ్మ సిద్దోగం వేడుకలను మూడు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారి వద్ద నుంచి బోనాలను తమ ఇళ్లలోకి డప్పు చప్పుళ్ల మధ్య తీసుకొచ్చారు. కార్యక్రమాల్లో గౌడకుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు



ముస్తాబాద్: ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు గుర్తిపంపు లభిస్తుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆదర్శన్‌రెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు స్వర్గం రాధాకృష్ణ ఉద్యోగ విరమణ పొందగా వారి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, నాయకులు దేవిరెడ్డి, కరుణాకర్, బాల్‌రెడ్డి, బషీర్, రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో గ్రామాల అభివృద్ధి



ఎల్లారెడ్డిపేట: కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం, ఎస్సీ శ్మశానవాటిక వద్ద బోరుబావు పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నో గ్రామాల్లో నీటి అవసరాల కోసం ఎంపీ నిధులతో బోరుపాయింట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తండాలు, గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, నీటి వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి, నాయకులు పొన్నాల తిరుపతిరెడ్డి, చందుపట్ల లక్ష్మారెడ్డి, మద్దుల బుగ్గారెడ్డి, నంది నరేశ్, రాజిరెడ్డి, సంజీవరెడ్డి, సాయికుమార్, దయాకర్‌రెడ్డి, గౌడ, దళితసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి



సదానందం (ఫైల్)

కోనరావుపేట: గుండెపోటుతో ఓ రైతు మృతిచెందాడు. రామన్నపేటకుకు చెందిన ఎర్ర సదానందం (50) భార్య మంజుల, కూతురితో కలిసి ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగొస్తున్నాడు. సిరిసిల్లలో దుకాణం వద్ద పండ్లు కొనుగోలు చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించి స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

అసంపూర్తి నిర్మాణాలు

- మండలంలో 18 అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు కరువు
- అద్దె భవనాల్లో చిన్నారుల ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు



ఎల్లారెడ్డిపేటలో అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణం

ఎల్లారెడ్డిపేట: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకచిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం పూర్తిగా నిధులు మంజూరు చేయడంతో భవన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఫలితంగా అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మండలంలో 24 గ్రామ పంచాయతీలుండగా 46 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 28 కేంద్రాలకు సొంత భవనాలుండగా, 18 కేంద్రాలు అద్దె భవనాలు, పాఠశాలల్లో నడుస్తున్నాయి. ఎనిమిది భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఏళ్లుగా పూర్తిగా నిర్మించేందుకు నిధులు మంజూరుకావడం లేదని అధికారులు తెలుపుతున్నారు. ప్రస్తుతం 18 కేంద్రాలకు గాను, ఎనిమిది కేంద్రాలకు భవన నిర్మాణాల కోసం నిధులు మంజూరైనట్లు అధికారులు తెలుపుతున్నారు. దీంతో చిన్నారుల సరైన వసతులు లేక ఇక్కట్లు పడుతున్నారు.

నిధులు మంజూరుకాక..

మండలంలో 46 కేంద్రాలుండగా 28 కేంద్రాలకు సొంత భవనాలున్నాయి. మరో 18 భవనాలకు ఎనిమిదేళ్ల క్రితం ఒక్కోభవనానికి రూ.8.50 లక్షల చొప్పున నిధులు మంజూరుకాగా పనులు ప్రారంభించారు. గత ఏడేళ్లుగా పనులు జరుగుతున్నా పూర్తిస్థాయిలో నిధులు మంజూరుకాక అసంపూర్తి నిర్మించారు. ఎనిమిది నిర్మాణాలు అసంపూర్తిగా, మరో 11 స్లాబ్, బేస్‌మెంట్ లెవల్ వరకే పరిమితమయ్యాయి. మండలకేంద్రంలో నాలుగు భవనాలు మరుగుదొడ్లు, నీటివసతి లేక నిరుపయోగంగా మారాయి. కొన్నిచోట్ల నిర్మాణాలు తుదిదశకు చేరినా సరైన వసతులు లేక వినియోగంలోకి రావడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు అన్ని వసతులు కల్పిస్తామని అధికారులు హామీలు ఇస్తున్నా అమలుకావడం లేదు. నిధులు పూర్తిస్థాయిలో మంజూరైతే నిర్మాణాలు పూర్తవుతాయి.

ఇరుకు గదుల్లోనే..

మండలంలోని 18 కేంద్రాలకు భవనాలు లేకపోవడంతో అద్దె భవనాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కేంద్రాలను కొనసాగిస్తున్నారు. సరైన వసతులు లేక విద్యార్థులు ఇరుకు గదుల్లోనే విద్యాభ్యాసం చేస్తున్నారు. అద్దె భవనాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నట్లు తల్లిదండులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేసి అసంపూర్తిగా ఉన్న భవనాలను అన్ని వసతులతో వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

స్థల సమస్య ఉంది



ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో మరమ్మతు పనులు మిగిలి ఉన్నాయి. కేంద్రాలకు వేరే చోట భవన నిర్మాణాలు చేపట్టేందుకు స్థల సమస్య ఉంది. 18 కేంద్రాలకు సొంత భవనాలు లేకపోగా ఎనిమిది కేంద్రాలకు భవన నిర్మాణాల కోసం నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే స్థలాలను ఎంపిక చేసి నిర్మాణ పనులు చేపడతాం.

– లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమాధికారి

మెజార్టీ సభ్యుల తీర్మానాన్ని గౌరవించాలి



మాట్లాడుతున్న నర్సయ్య

సిరిసిల్లఅర్బన్: ఇల్లంతకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మెజార్టీ పాలకవర్గ సభ్యుల తీర్మానాన్ని జిల్లా సహకార అధికారి గౌరవించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గన్నేరపు నర్సయ్య అన్నారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. పీఏసీఎస్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి వ్యక్తిగత పర్యటన నిమిత్తం వెళ్తున్న సందర్భంగా తాత్కాలిక అధ్యక్షుడిని ప్రకటించాలని జిల్లా సహకార అధికారిని కోరినట్లు తెలిపారు. ఈక్రమంలో పాలక వర్గ సభ్యుడు నాయిని నవీన్‌కుమార్‌ను తాత్కాలిక అధ్యక్షుడిగా నియమించాలని తీర్మానం చేసి మంగళవారం సహకార అధికారికి అందజేశామని, అయితే అప్పటికే మెజార్టీ సభ్యుల తీర్మానం కాదని మరో సభ్యుడికి తాత్కాలిక అధ్యక్షుడిగా నియామక పత్రం అందజేశారన్నారు. ఈ విషయమై జిల్లా సహకార అధికారిని వివరణ కోరగా.. తమకున్న అధికారంలో ఇంతకు ముందు ఉన్న ఉపాధ్యక్షుడికి నియామకపత్రం అందజేశామని చెప్పారని తెలిపారు. సమావేశంలో పాలక వర్గ సభ్యులు నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సత్తయ్య, సృజన్‌రెడ్డి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యారన్ సబ్సిడీ అందించాలి

సిరిసిల్ల టౌన్: మహిళా శక్తి చీరల పవర్లూమ్ కార్మికులతో పాటు అనుబంధ రంగాల కార్మికులకు సబ్సిడీ అందించాలని పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ కోరారు. పవర్లూమ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం చేనేత జౌళిశాఖ కమిషనర్ శైలజ రామయ్యర్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. టెక్స్‌టైల్, ఇతర రాష్ట్రాల కార్మికులకు 10 శాతం యారన్ సబ్సిడీ ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. ఇతర రాష్ట్రాల కార్మికుల కష్టాన్ని కాజేయడం సరికాదన్నారు. చేనేత జౌళిశాఖ ఆఫీస్‌ను కలెక్టరేట్ నుంచి బీవై నగర్ పాత ఆఫీస్‌కు మార్చాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇక్కడ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, తదితరులు పాల్గొన్నారు.

అత్తపై దాడిచేసిన వ్యక్తికి మూడేళ్ల జైలు

సిరిసిల్లకల్చరల్: అత్తపై దాడిచేసి గాయపరిచిన ఓ వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎ. ప్రవీణ్ మంగళవారం తీర్పునిచ్చారు. టౌన్ సీఐ కృష్ణ వివరాల ప్రకారం... కరీంనగర్‌లోని బోయవాడకు చెందిన రాపోలు శశికళ వృద్ధాప్యంతో పట్టణంలోని సిద్దులవాడలోని కూతురు పద్మావతి వద్ద ఉంటోంది. అల్లుడు కర్నాబత్తులు ప్రేమ్‌సాగర్‌రావు జులాయిగా తిరుగుతూ మద్యం తాగుతుండేవాడు. దీంతో ప్రేమ్‌సాగర్ తండ్రి తన ఇంటిని మనవడు ఆశిష్ పేరుతో రాసిచ్చాడు. 2017 మే 9న ఇంటిముందు అరుగుపై కూర్చున్న శశికళపై దాడిచేయగా తీవ్రగాయాలు కాగా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందింది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఆరుగురు సాక్షులను విచారించిన అనంత రం నేరం రుజువైన కారణంగా ప్రేమ్‌సాగర్‌కు మూ డేళ్ల జైలు, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

రాజన్న ఆలయ ఈవోకు సన్మానం



వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన రాధాబాయిని ఘనంగా సన్మానించారు. ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కూరగాయల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, అర్చకులు మంగళవారం ఈవో చాంబర్‌లో సత్కరించారు.

అంగన్‌వాడీల్లో అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కళావతి హాజరై చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. కళావతి మాట్లాడుతూ... ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని గర్భిణులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఆశకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

క్షయ బాధితులు పౌష్టికాహారం తీసుకోవాలి



ఇల్లంతకుంట: క్షయ వ్యాధి బాధితులు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా టీబీ ముక్త్ అభియాన్ సూపర్‌వైజర్ జైత్య అన్నారు. మండలంలోని అనంతారం గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం టీబీ ముక్తి అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అనుమానితులకు వివిధ పరీక్షలు నిర్వహించి 11 మందిని జిల్లా ఆసుపత్రికి పరీక్షల కోసం వాహనంలో తరలించారు. కార్యక్రమంలో ఇల్లంతకుంట పీహెచ్‌సీ వైద్యురాలు జీవనజ్యోతి, హెచ్‌ఈఓ వెంకటరమణ, సీహెచ్ ఓ శాంత, పీహెచ్ఎన్ తారాబాయి, గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, ఏఎన్ఎం స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

మట్టి ట్రాక్టర్లు పట్టివేత

ముస్తాబాద్: మండలకేంద్రంలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలి పారు. మండలంలో ఎలాంటి అనుమతులు లే కుండా నడుస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేశామన్నా రు. మైనింగ్, రెవెన్యూ అనుమతులు పొందిన తర్వాతే మట్టిని తరలించాలన్నారు. పట్టుబడిన ట్రాక్టర్లనుఠాణాకు తరలించినట్లు పేర్కొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక పరీక్ష

బోయినపల్లి: రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలలో 2025–2026 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి ప్రవేశానికి విద్యార్థుల ఎంపికకోసం ఈనెల 19న మండలంలోని నర్సింగాపూర్ హైస్కూల్‌లో ఎంపిక పరీక్ష నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీ ఎన్. శ్రావణ్ కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలోని అన్ని ప్రాథమిక స్థాయిలో చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్షలో పాల్గొనే వారు తేదీ 01.09.2016 నుండి 31.08.2017 మధ్య పుట్టినవారై ఉండాలన్నారు. ఉత్తీర్ణులైన వారిని జిల్లాస్థాయికి పంపనున్నట్లు పేర్కొన్నారు.

కరపత్రాల పంపిణీ

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులతో కలిసి నందికమాన్ వద్ద ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి మంగళవారం కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత రేషన్ బియ్యం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా రూ.4 కోట్లకు పైగా ఇళ్ల నిర్మాణం అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, లక్ష్మణ్, భాస్కర్, పర్శరాములు, శ్రీనివాస్, సంజీవరెడ్డి, బాను తదితరులు ఉన్నారు.

పుస్తకాలు అందజేత

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలకేంద్రంలోని అంబేడ్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని బీసీటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్ కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

రుద్రంగి: తాటి చెట్టుపై నుంచి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన మల్యాల మల్లేశం గౌడ్ రోజూలాగే మంగళవారం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా జారి కిందపడ్డాడు. మల్లేశంకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసత్రికి తరలించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గౌడసంఘం సభ్యులు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో పూర్తి చేయాలి

ఎల్లారెడ్డిపేట: గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు సకాలంలో పూర్తిచేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య కోరారు. మండలంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన రాచర్లగుండారంలో ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. గ్రామంలో మొదటి దశ కింద 184 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. 105 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. లబ్ధిదారులకు ఇప్పటికే రూ.లక్ష చొప్పున వారి ఖాతాల్లో జమచేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చైతన్య, ఏఎంసీ డైరెక్టర్ రాజేందర్, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, దేవేందర్, రాజునాయక్ పాల్గొన్నారు.

అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు

ముస్తాబాద్: మండలంలో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని సెస్ ఏఈ విష్ణుతేజ అన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఉన్న కెపాసిటీ మేరకు బోరు బావులకు అనుమతి ఇస్తున్నామన్నారు. కొందరు రైతులు ఎలాంటి అనుమతులు పొందకుండానే బోరు మోటార్లు నడుపు కుంటున్నారని, దీంతో ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లపై అధిక లోడు పడుతుందన్నారు. రైతులు విద్యుత్ కనెక్షన్లను రెగ్యులర్ చేసుకున్నప్పుడే ట్రాన్స్‌ఫార్మర్లను కేటాయించనున్నట్లు తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక



ఇల్లంతకుంట: మహిళా కాంగ్రెస్ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అధ్యక్షురాలు వెలిశాల జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా గజ్జల కరుణ, కార్యదర్శులుగా తడకపెల్లి జ్యోతి, బోయిని పద్మ ,ఉపాధ్యక్షులుగా కీసర సుజాత, గ్రామ కమిటీలో శ్యామల, మంజుల, జేరిపోతుల కల్యాణి, గుడిసెల పద్మ, జంగటి మమత, గజ్జల సీత, తడకపెల్లి అనూష, గారాలను నియమించినట్లు పేర్కొన్నారు.



కోనరావుపేట: మండలకేంద్రంలోని గాంధీనగర్ ఏరియాలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీల్లో మురుగు నిల్వడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మురుగునీరు ముందుకు పారకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. వెంటనే మురుగు కాలువలను శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : ఆరిఫ్ పాషా, ఎంపీవో, సెల్ నెం. 9989249855

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

సీపీఐకి పునర్‌వైభవం తీసుకొస్తాం



మాట్లాడుతున్న సుదర్శన్

సిరిసిల్లటౌన్: జిల్లాలో సీపీఐకి పునర్‌వైభవం తీసుకొస్తామని పార్టీ నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అన్నారు. మంగళవారం కార్మిక భవన్‌లో మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలంగా ఉన్నచోట పోటీ చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో అన్ని ప్రజా సంఘాలను బలోపేతం చేస్తూ కార్మికవర్గ ప్రయోజనాల కోసం నిరంతరం పని చేస్తామన్నారు. జిల్లాలో సాగుకు యోగ్యమైన లక్ష ఎకరాలకు పైగా పోడు భూములు ఉన్నాయని, వాటిని అర్హులైన రైతు కూలీలకు పంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో నాణ్యత లేకుండా చెక్‌డ్యామ్‌లు నిర్మించిన కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బీవై నగర్‌లో రెండువేల మందికి ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూములపై రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి వేణు, పంతం రవి, కడారి రాములు, మీసం లక్ష్మణ్, కేవీ అనసూయ, మంద అనిల్, తిరుపతిరెడ్డి, అజ్జ వేణు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న గీత

బోయినపల్లి(చొప్పదండి): ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందని జెడ్పీ డిప్యూటీ సీఈవో వంగ గీత పేర్కొన్నారు. పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన వెంకట్రావుపల్లి, కొదురుపాక, వరదవెల్లి హైస్కూళ్ల హెచ్‌ఎంలను చంద్ర ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ చెన్నమాధవుని రామరాజు– లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈవో మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభు త్వ పాఠశాలల్లో చదివించాలని కోరారు. ఎంఈవో ఎస్.శ్రవణ్‌కుమార్, హెచ్‌ఎంలు తిరుపతి, ఉషారాణి, రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే మెరిట్ సాధించిన విద్యార్థులను మెమోంటోలతో సత్కరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



విక్రయదారులతో మాట్లాడుతున్న ఈవో రమేశ్

ముస్తాబాద్: ముస్తాబాద్ మేజర్ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ ఈవో రమేశ్ మటన్ షాపు నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మేకలు, గొర్రెలను తప్పనిసరిగా వెటర్నరీ అధికారుల స్టాంపింగ్‌తో అనుమతులు పొంది వధించాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ తీసుసుకోవాలన్నారు. మృత్యువాత పడిన జీవాల మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యల పరిష్కారానికే భూ భారతి



ఎల్లారెడ్డిపేట: రైతులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ మురళీకృష్ణ



ఇల్లంతకుంట : ఓబులాపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: భూ భారతితో రెవెన్యూ సమస్యలు పరిష్కారమవుతాయని ఎల్లారెడ్డిపేట నాయబ్ తహసీల్దార్ మురళీకృష్ణ పేర్కొన్నారు. రాచర్లగుండారంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇకపై రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రత్యేకంగా భూమికి భూఆధార్ నంబర్ వస్తుందని, కొలతలతో కూడిన మ్యాప్ వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, డైరెక్టర్లు సుడిగా రాజేందర్, మెండె శ్రీనివాస్, రాజునాయక్, జజ్జరి దేవేందర్, శ్రీనివాస్, రాథోడ్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని వెంకట్రావుపల్లి, ఓబులాపూర్, గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. ఓబులాపూర్‌లో తహసీల్దార్ ఎంఏ ఫారుక్ రైతుల నుంచి 91 దరఖాస్తులు స్వీకరించగా, వెంకట్రావుపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ 18 దరఖాస్తులు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సంతోష్, శశి, వీఆర్వో సింగారెడ్డి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.